చిన్న ఉద్యోగం.. పెద్ద శిక్ష

- అగమ్యగోచరంగా క్లాప్ ఆటో డ్రైవర్ల పరిస్థితి
- ఏలూరు నగరపాలక సంస్థలో 60 మంది క్లాప్ ఆటో డ్రైవర్ల తొలగింపు
- ఫిబ్రవరి ఒకటి నుంచి ఎటూ తేల్చని వైనం



చెత్తను వాహనంలో వేస్తున్న క్లాప్ ఆటో డ్రైవర్ (ఫైల్)

ఏలూరు (టూటౌన్): రెక్కాడితేగాని డొక్కాడని బతుకులు..చాలీ చాలని వేతనాలు.. అయినా తల వంచుకుని తమ విధులను నిర్వహించేవారు. అయినా వారిపై పాలకులు కత్తి కట్టారు. ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా ఈ ఏడాది ఫిబ్రవరి 1 నుంచి ఏలూరు నగరపాలక సంస్థలో పనిచేస్తున్న 60 మంది క్లాప్ ఆటో డ్రైవర్లను విధుల నుండి తొలగించారు. దీంతో తొలగించిన క్లాప్ ఆటో డ్రైవర్ల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ఉన్నట్టుండి విధుల్లోంచి తొలగించడంతో తాము కుటుంబాలతో రోడ్డున పడ్డామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణం తమను విధుల్లోకి తీసుకుని ఉద్యోగ భద్రత కల్పించాలంటూ వారు ముక్త కంఠంతో వేడుకుంటున్నారు.

రాజకీయ దురుద్దేశంతోనే..

నగరపాలక సంస్థపరిధిలో పనిచేస్తున్న క్లాప్ ఆటో డ్రైవర్లను రాజకీయ దురుద్దేశంతోనే విధుల నుండి తొలగించారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా 5,300 క్లాప్ ఆటోలను ప్రవేశ పెట్టారు. వీటి నిర్వహణ బాధ్యతను నాలుగు ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించారు. దీనిలో భాగంగా ఏలూరులో స్వయంభూ అనే ఏజెన్సీ క్లాప్ ఆటోలను నిర్వహిస్తుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా వైఎస్సార్ సీపీ కాంట్రాక్టర్లే లబ్ధి పొందుతున్నారనే అక్కసుతోనే పాత వారిని తొలగించేందుకు క్లాప్ ఆటోల సేవలను నిలుపుదల చేశారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఈ వాదనలు నిజం చేస్తున్నట్లుగానే కూటమి సర్కార్ క్లాప్ ఆటోలను తొలగించడం, అప్పటి వరకు పనిచేసిన డ్రైవర్లు రోడ్డున పడటం చక చకా జరిగిపోయాయి. కనీసం తొలగించిన డ్రైవర్లకు ప్రత్యామ్నాయం కూడా చూపకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఏజెన్సీలకు పేరుకుపోయిన బకాయిలు

గతంలో వార్డు సచివాలయాల వారీగా చెత్త పన్ను సేకరించి వాటి నుండి క్లాప్ ఆటోలు నిర్వహించే ఏజెన్సీలకు సొమ్ములను చెల్లించేవారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చెత్త పన్నును రద్దు చేయడంతో ఆ భారం కార్పొరేషన్‌పై పడింది. దీంతో కార్పొరేషన్ నిర్వహణ బాధ్యతల నుంచి తప్పుకునేందుకు క్లాప్ ఆటో సేవలను నిలుపుదల చేయడం ఎంత వరకు సమంజసం? అంటూ ఆటో డ్రైవర్లు ప్రశ్నిస్తున్నారు. కావాలనే పనిగట్టుకుని క్లాప్ ఆటో సేవలను నిలుపుదల చేయాలనే ఉద్దేశంతోనే బకాయిలను పెంచేసి చివరకు క్లాప్ ఆటో సేవలనే రద్దు చేశారని సంబంధిత డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏలూరు కార్పొరేషన్ పరిధిలో క్లాప్ వాహనాలు ప్రారంభించిన తొలిరోజుల్లో మొత్తం 90 వాహనాలు సేవలు అందించేవి.వీటి సేవలను రద్దుచేసే నాటికి వాటి సంఖ్య 60కి చేరింది.దాదాపు 30 వాహనాలు రిపేర్లు వచ్చి మూలన పడ్డాయి. వీటిని సరిచేసి తిరిగి రోడ్లు మీద తిరిగేలా చేయడంలోనూ కార్పొరేషన్ అధికారులు అలసత్వం వహించారనే విమర్శలు ఉన్నాయి.

అడుగడుగునా ఇక్కట్లే

ఏలూరు నగర పాలక సంస్థలో పనిచేసిన క్లాప్ ఆటో డ్రైవర్లకు అడుగడుగునా ఇక్కట్లే ఎదురయ్యాయి. అయినా వాటిని మౌనంగా భరిస్తూ విధులు నిర్వహిస్తూ వచ్చారు. మూలిగే నక్కపై తాటిపండు పడిన చందంగా చేస్తున్న పనిని సైతం కూటమి ప్రభుత్వం దూరం చేయడంతో ఏంచేయాలో పాలుపోని దుస్థితిలో క్లాప్ ఆటో డ్రైవర్లు కొట్టుమిట్టాడుతున్నారు. కనీసం వారిని ఇతర పనుల్లోకి కూడా తీసుకోకపోవడంపై క్లాప్ ఆటో డ్రైవర్లు ఆవేదన చెందుతున్నారు. దీంతో గత ఆరు నెలలుగా తాము రోడ్డున పడ్డామని, ఉపాధి కోసం నానా అగచాట్లు పడుతున్నామని క్లాప్ ఆటో డ్రైవర్లు చెబుతున్నారు.

తక్షణం విధుల్లోకి తీసుకోవాలి



ఏలూరు కార్పొరేషన్ పరిధిలోని క్లాప్ ఆటో డ్రైవర్లను తక్షణం విధుల్లోకి తీసుకోవాలి. క్లాప్ ఆటో డ్రైవర్లుకు ఎటువంటి ముందస్తు సమాచారం, నోటీసులు లేకుండా విధుల నుంచి తొలగించడం దుర్మార్గం. తక్షణం వీరిని విధుల్లోకి తీసుకుని ఉద్యోగ భద్రత కల్పించాలి. పెండింగ్‌లో ఉన్న వేతనాల బకాయిలను తక్షణం చెల్లించాలి. ఏడాది నుంచి పీఎఫ్‌లో వాటాను జమ చేయాలి.

– బి.సోమయ్య, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఏలూరు

విధుల్లోంచి తొలగించడం అన్యాయం



చేస్తున్న పని నుంచి అకస్మాత్తుగా తొలగించడం అత్యంత దుర్మార్గం, అన్యాయం. చేస్తున్న పని నుంచి తొలగిస్తే మేము ఎలా బతుకుతాం. మాకు ఉన్న ఒక్క ఆధారం పోతే ఏం చేయాలి? మాలాంటి చిరు ఉద్యోగులపై కూటమి ప్రభుత్వం పెద్ద మనసుతో ఆలోచించి తిరిగి విధుల్లోకి తీసుకోవాలి. మాకు ఉద్యోగ రక్షణ కల్పించాలి.

– జి.శ్రీను, క్లాప్ ఆటో డ్రైవర్, ఏలూరు నగరపాలక సంస్థ

మా కుటుంబాలు రోడ్డున పడ్డాయి



ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా మమ్మల్ని విధుల్లోంచి తొలగించడం బాధాకరం. దీని వల్ల సాఫీగా సాగే మాకుటుంబాలు రోడ్డున పడ్డాయి."తక్షణం విధుల్లోకి తీసుకోవాలి. మాలాంటి చిన్న డ్రైవర్లపై ఇంతటిపెద్ద ప్రతీకారం తీసుకోవడం అత్యంత దారుణం. అవసరమైతే నగరపాలక సంస్థ మాకు ప్రత్యామ్నాయంగా విధులు కల్పించాలి.

– జి.రాజు, క్లాప్ ఆటో డ్రైవర్, ఏలూరు నగరపాలక సంస్థ

నగరపాలక సంస్థ తీరు అత్యంత దారుణం



గత మూడున్నరేళ్లుగా చేస్తున్న విధుల నుంచి అకస్మాత్తుగా ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా తొలగించడం దారుణం. ప్రైవేట్ సంస్థలను తలదన్నే విధంగా ఏలూరు నగరపాలక సంస్థ ఇలాంటి నిర్ణయం తీసుకోవడం బాధాకరం. చేస్తున్న విధుల నుండి తొలగించడంతో గత ఆరు నెలల నుంచి మేము ఇబ్బందులను ఎదుర్కొంటున్నాం. దీనిపై నగరపాలక సంస్థ పునరాలోచన చేయాలి.

– బి.శ్రీను, క్లాప్ ఆటో డ్రైవర్

క్లుప్తంగా

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న రఫీఖ్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏ దేశంలో అయితే యువత మత్తు పదార్థాలకు బానిస అయిపోతుందో ఆదేశం నాశనం అయిపోతుందని జమాతే ఇస్లామీ హింద్ ఆంధ్ర ప్రదేశ్ అధ్యక్షుడు మహమ్మద్ రఫీఖ్ అన్నారు. ఏలూరు ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక బీడీ కాలనీ మసీదులో ఆదివారం మత్తు పదార్థాల వల్ల జరిగే అనర్థాలపై యువతకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వక్తలు రఫీఖ్, జేఏసీ కన్వీనర్ ఇలియాజ్, జేఏసీ కో- కన్వీనర్ అజీజ్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు.

ఆధ్యాత్మికతతో శాంతియుత సమాజం



జేపీకి జ్ఞాపిక అందిస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రజల్లో ఆధ్యాత్మికత పెరిగితే శాంతి యుత సమాజ స్థాపన సాధ్యమవుతుందని వైఎస్సార్ సీపీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ మామిళ్లపల్లి జయ ప్రకాష్(జేపీ) అన్నారు. ఆదివారం కొత్తూరు కోదండ రామాలయం ఆలయ నిర్మాణ కమిటీ వారి ఆహ్వానం మేరకు కోదండ రామాలయం శంకుస్థాపన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరిలో భక్తి భావం పెరగాలని, సాటి మనిషిలో భగవంతుని చూడాలని సూచించారు. అనంతరం ఆలయ కమిటీ ప్రతినిధులు ఆయనకు జ్ఞాపిక ఇచ్చి సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గుడిదేసి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్ బాబు, నెరుసు చిరంజీవులు, కిలాడి దుర్గారావు, కొల్లిపాక సురేష్, బోశెట్టి పార్వతి పాల్గొన్నారు.

ఇద్దరు వ్యక్తులపై దాడి

జంగారెడ్డిగూడెం: దాడి ఘటనలో ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. వివరాల ప్రకారం సెంట్రింగ్ పనులు చేస్తున్న బొబ్బిలి వెంకటేష్ వద్ద బంటు రాము హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. స్థానిక సాయి బాలాజి టౌన్‌షిప్ సెంటర్‌లో రాముపై నరేంద్ర, సాయి దాడి చేసి తీవ్రంగా కొట్టారు. విషయం తెలుసుకున్న వెంకటేష్ ఘటనా స్థలానికి చేరుకుని వారిని అడ్డుకోగా వెంకటేష్‌పై కూడా దాడి చేశారు. ఈ ఘటనలో గాయపడ్డ వీరిద్దరిని స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

ఆయిల్ పామ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి రామకృష్ణ

ఏలూరు (టూటౌన్): ఆయిల్ పామ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని ఆదివారం స్థానిక అన్నే వెంకటేశ్వర భవనంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.జీవరత్నం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో సుమారు పదివేల మంది ఆయిల్ పామ్ గెలలు, మట్టలు కోసే కార్మికులు ఉన్నారని వారికి రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. వీరితోపాటు లోడింగ్, అన్‌డింగ్ చేసే కార్మికులు మరో రెండు వేల మంది పైగా ఉంటారని తెలిపారు. వీరందరినీ రాష్ట్ర ప్రభుత్వం, కార్మిక శాఖ కార్మికులుగా గుర్తించాలని, కార్మిక చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ యాజమాన్యాల ద్వారా కార్మికులకు గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు తామా ముత్యాలమ్మ, ఎస్.మహంకాళి రావు, వై.నాగేంద్ర రావు, జి.వెంకట్రావు, కారం నాగ దుర్గ, సాయికృష్ణ, ప్రభాకర్, సీత తదితరులు పాల్గొన్నారు.

520 మందికి వైద్య సేవలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక కెనాల్ రోడ్డులోని శ్రీ గాంధీ ఆంధ్ర జాతీయ మహావిద్యాలయంలో శ్రీ దుర్గా జై జై లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి 520 మంది వైద్య సేవలు పొందారు. ఈ శిబిరంలో డాక్టర్ గోపాళం శివన్నారాయణ, డాక్టర్ మురళి ఫిట్స్, పెరాలిసిస్, బీపీ, షుగర్ వ్యాధులకు సంబంధించి వైద్య సేవలు అందించారు. ఈ శిబిరంలో 32 మంది వలంటీర్లు పనిచేయగా, పాఠశాల కార్యనిర్వహణాధికారి వై.రవి శంకర్ రోగులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వెలగా శ్రీనివాస్, కోడూరి రామకృష్ణ, సాయిరాజు భల్లం తదితరులు పాల్గొన్నారు.

శ్రావణ మహాలక్ష్మి దర్శనానికి మూడు బస్సులు



శ్రావణ మహాలక్ష్మి దర్శనం ప్రత్యేక బస్సు సర్వీసుల్లో బయలుదేరుతున్న మహిళలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ టెంపుల్ టూరిజంలో భాగంగా శ్రావణమాసంలో అమ్మవారి దేవాలయాలను భక్తులు సందర్శించే నిమిత్తం ఏర్పాటు చేసిన శ్రావణ మహాలక్ష్మి దర్శన ప్రత్యేక బస్సు సర్వీసులు ఏలూరు డిపో నుంచి ఆదివారం మూడు బయలుదేరి వెళ్లాయని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎస్‌కే. షబ్నం తెలిపారు. శ్రావణమాసం స్పెషల్ 3 సూపర్ లగ్జరీ బస్సులలో ఏలూరులోని అంబికా దర్బార్ బత్తి సంస్థ కార్మికులు ఈ యాత్రకు బయలుదేరి వెళ్లారని తెలిపారు. టెంపుల్ టూరిజంలో భాగంగా ప్రజలకి ఆయా మాసాల విశిష్టతను బట్టి బస్సులు నడుపుతున్నామని దీనిని చాలామంది ఆదరిస్తున్నారన్నారు. 17న కూడా ఆఖరి శ్రావణ ఆదివారం కాబట్టి ఇంకా ఎవరైనా ముందుకు వస్తే వారికి కూడా బస్సు ఏర్పాటు చేస్తామని రేపటి నుంచి రిజర్వేషన్ సౌకర్యం కూడా ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతామన్నారు. శబరిమల అయ్యప్ప స్వామి యాత్రకి బస్సులు బుక్ చేసుకునే స్వాములు ఇప్పటి నుంచే బుక్ చేసుకోవచ్చని తెలిపారు. గురు స్వాములకి అనుగుణంగా యాత్ర ఉంటుందని, మరిన్ని వివరాలకు 93467 67670, 63038 59484 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

అక్రమ కేసులతో గొంతునొక్కే ప్రయత్నం



సమావేశంలో మాట్లాడుతున్న సమన్వయకర్త జయప్రకాష్



వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఏలూరు టౌన్: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది గడచినా నేటికీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయటంలో విఫలమైందనీ... కానీ ప్రతిపక్ష వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి భయభ్రాంతులకు గురి చేయడమే లక్ష్యంగా పెట్టుకుందని వైఎస్సార్ సీపీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ విమర్శించారు. ఏలూరు వన్‌టౌన్ 15వ డివిజన్‌లో ఆదివారం రాత్రి బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని 15వ డివిజన్ కార్పొరేటర్ తంగెళ్ల రాము ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత దివంగత మహానేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం రీకాలింగ్ బాబూస్ మేనిఫెస్టో క్యూఆర్ కోడ్ ప్లకార్డులను పార్టీ నేతలు, కార్యకర్తలు ప్రదర్శించారు. కూటమి పాలనలో ప్రజలను ఏవిధంగా మోసం చేశారో? వివరించారు.

పేదలకు అందని సంక్షేమ పథకాలు

ఈ కార్యక్రమంలో ఏలూరు సమన్వయకర్త జేపీ మాట్లాడుతూ రాష్ట్రంలో పేదలకు సంక్షేమ పథకాలు అందకపోవటంతో కొనుగోలు శక్తి క్షీణించిదనీ, కనీసం చిరు వ్యాపారాలు సైతం పూర్తిగా డీలాపడి అన్ని వర్గాలు ఆర్థిక నష్టాల్లో కూరుకుపోయాయని ఆరోపించారు. గతంలో కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ రాష్ట్ర ప్రజలకు సంక్షేమంతోపాటు, ఆర్థిక వ్యవస్థను ఆదుకుంటూ సంక్షేమ పథకాలకు సంబంధించి డబ్బులు ప్రతి ఇంటికీ వేయడం ద్వారా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని ఆర్థిక ఇబ్బందుల నుంచి రక్షించారని గుర్తు చేశారు. నేడు కూటమి ప్రభుత్వం కేవలం అమరావతి పేరుతో కాలయాపన చేస్తూ ... వేలకోట్లు అప్పులు చేస్తూ అక్కడి రైతులను మభ్యపెట్టే కార్యక్రమం చేస్తోందని ఆరోపించారు. ఏలూరు నగర అధ్యక్షుడు గుడిదేశి శ్రీనివాసరావు మాట్లాడుతూ నగరంలో అభివృద్ధి ఆగిపోయిందనీ, ప్రజలకు సంక్షేమ పథకాలు సైతం పూర్తిస్థాయిలో అందడం లేదని, ప్రజలు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం 2024 ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను సైతం పూర్తిస్థాయిలో అమలు చేయలేక చేతులెత్తేసిందని విమర్శించారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకపెయ్యి సుధీర్‌బాబు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు నెరుసు చిరంజీవి, జిల్లా అధికార ప్రతినిధి మున్నుల జాన్‌గురునాథ్, బీసీ సెల్ నగర అధ్యక్షులు కిలాడి దుర్గారావు, నగర మహిళా అధ్యక్షురాలు జిజ్జువరపు విజయనిర్మల, మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుమరాడ స్రవంతి, వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఘంటా మోహనరావు, పార్టీ నాయకులు కొల్లిపాక సురేష్, తులసీ, మట్టా రాజు, మేతర సురేష్, రుబీనా, దాలి వెంకటేష్, ఉమా మహేశ్వరరావు, బండ్లమూడి సునీల్, రావి నాని, రావి సునీత, కొవ్వాడ దుర్గారావు, ఫణి తదితరులు పాల్గొన్నారు.

మామిళ్లపల్లి జయప్రకాష్

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	48	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	50
వంకాయలు (కాంతులు)	28	బీన్లచిక్కుడు	140
వంకాయలు (తెలుపు)	30	చామదుంపలు	36
బెండకాయలు	30	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	50	కంద	00
కాకర కాయలు	40	బీట్‌రూట్	38
బీరకాయలు	20	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	30	ఫ్రెంచ్‌బీన్స్	90
క్యాబేజీ	26	అల్లం	68-86
క్యారెట్	45	కొత్తిమీర (కట్ట)	20
దొండకాయలు	34	పాలకూర	12
బంగాళదుంపలు	32	తోటకూర	10
ఉల్లిపాయలు	25	చుక్కకూర	12
గోరుచిక్కుడు	40	గోంగూర	07-10
దోసకాయలు	28	పుదీనా	05
ఆనబకాయ (1)	20-30	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	48

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	12
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	28
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	16
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	03
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	07
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	12
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	07
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	13
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	14
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	09
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	00
ఏలూరు - తిరుపతి	16.00	4830	31

12న నులిపురుగుల నివారణ మందుల పంపిణీ

దెందులూరు: నులిపురుగుల నివారణ మందుల పంపిణీ ఈనెల 12న నిర్వహిస్తామని ఏలూరు రూరల్ మండలం చాటపర్రు పీహెచ్‌సీ వైద్యాధికారులు జి.కృష్ణ ప్రదీప్ చంద్ర అన్నారు. ఆదివారం చాటపర్రు పీహెచ్‌సీలో వారు మాట్లాడుతూ రెండు సంవత్సరాల నుంచి 19 సంవత్సరాలు వయసు లోపు ఉన్న విద్యార్థులందరికీ ఈ నెల 12న పాఠశాలలు, అంగన్‌వాడీ, కళాశాలలో నులిపురుగుల నివారణ టాబ్లెట్లును వైద్య సిబ్బంది అందజేస్తామన్నారు. ఇందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. కరపత్రాలు, మందులు పాఠశాలలు, అంగన్‌వాడీ, కళాశాలలకు పంపించామని స్పష్టం చేశారు.

టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందించాలి

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరంలో 6 వేల టిడ్కో ఇళ్ళను లబ్దిదారులు కు వెంటనే అందించాలని సీపీఎం నగర కార్యదర్శి పంపన రవి కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పదేళ్లగా టిడ్కో ఇళ్లను ప్రజలకు అందించడానికి సమయం సరిపోవటం లేదా? అని ప్రశ్నించారు. అలాగే లక్ష్మీపురం, కోమడవోలు, పోణంగిల్లో 20 వేల మందికి జగనన్న కాలనీలు ఇచ్చారని పేర్కొన్నారు. అయితే ఆ కాలనీల్లో సరైన రోడ్లు, తాగు నీరు, కరెంట్, డ్రైనేజి వంటి కనీస వసతులు కల్పించడంలో పాలకులు శ్రద్ధ చూపాలని డిమాండ్ చేశారు.

భక్తుడికి గాయాలు

ద్వారకాతిరుమల: శ్రీవారి కొండపైన జంటగోపురాల ప్రాంతంలో కళ్లు తిరిగి పడిపోవడంతో ఓ భక్తుడికి గాయాలయ్యాయి. విజయవాడలోని గొల్లపూడికి చెందిన రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ ఎం.సుబ్బారావు ఆదివారం సాయంత్రం కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం బయటకు వచ్చే క్రమంలో అనివేటి మండపంలో కళ్లు తిరిగి పడిపోవడంతో స్వల్పంగా గాయపడ్డారు. కుటుంబ సభ్యులు, భక్తుల సహాయంతో జంటగోపురాల ప్రాంతానికి చేరుకుని మరోసారి అక్కడ పడిపోవడంతో తలకు తీవ్ర గాయమైంది. కుటుంబ సభ్యులు ఆలయ ప్రథమ చికిత్సా కేంద్రానికి తరలించగా, అక్కడ వైద్య చికిత్స అందించారు.

బస్సును ఢీ కొట్టిన లారీ

దెందులూరు: జాతీయ రహదారిపై కొమరేపల్లి వద్ద ఆదివారం సీతంపేట వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సును వెనుక నుంచి వస్తున్న లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు వెనుక భాగం, లారీ ముందు భాగం దెబ్బతిన్నాయి. ఈ ప్రమాదంలో రెండు వాహనాల్లో ఉన్న వారికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

కూల్‌డ్రింక్స్ లారీ బోల్తా



కలపర్రు సమీపంలో జాతీయ రహదారిపై బోల్తా పడిన కూల్‌డ్రింక్స్ లారీ

ఏలూరు టౌన్: ఏలూరు జాతీయ రహదారిపై పెదవేగి మండలం కలపర్రు టోల్‌ప్లాజా సమీపంలో కూల్‌డ్రింక్స్ లోడ్‌తో వెళుతోన్న ట్రాలీ లారీ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. హైవే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విజయవాడ నుంచి విశాఖపట్నం ప్రాంతానికి మినిట్ మెయిడ్ పల్పీ ఆరెంజ్ కూల్‌డ్రింక్ బాటిల్స్ లోడుతో ట్రాలీ లారీ బయలుదేరింది. ఈ లారీ కలపర్రు కొక్కిరపాడు వంతెన సమీపానికి చేరుకునేసరికి ఆకస్మికంగా అదుపుతప్పి డివైడర్ ఎక్కి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ పరారవ్వగా, 108 సిబ్బంది ప్రమాదస్థలానికి చేరుకుని క్లీనర్‌కు ప్రాథమిక చికిత్స అందించారు. హైవే పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

ఎస్సీ క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి



రౌండ్ టేబుల్‌సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఏలూరు (టూటౌన్): ఎస్సీ క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ కోరారు. స్థానిక ఎన్ఆర్‌పేటలోని ఎస్సిఆర్‌పియస్ అండ్ ఏఐఏవైఎస్ రాష్ట్ర కార్యాలయంలో 1950 రాష్ట్ర పతి ఆర్డరుపై ఆదివారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంతోష్ కుమార్ మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 ప్రకారం మత స్వేచ్ఛ, ఆర్టికల్ 14 ప్రకారం సమానత్వం,ఆర్టికల్ 21 ప్రకారం జీవించే హక్కు కల్పించారన్నారు. ఎస్సీ క్రైస్తవులకు మాత్రం పాలకులు చట్ట పరంగా ఎస్సీ హోదా కల్పించకపోవడం విచారకరమన్నారు.బిషప్ శాంతి సాగర్ మాట్లాడుతూ 1950 రాష్ట్రపతి ఆర్డినెన్స్ ఇచ్చిన రోజుని బ్లాక్ డేగా ప్రకటిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పీవీ రాజు, యోహాను, కుర్మా రాజు, అబ్రహం , నూకపెయ్యి కార్తీక్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పది మంది జూదరుల అరెస్ట్

ద్వారకాతిరుమల: మండలంలోని మలసానికుంటలో ఆదివారం సాయంత్రం ఒక కోడి పందేల స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో 10 మందిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.4,770 నగదు, 8 బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

పేకాట శిబిరంపై దాడి

జంగారెడ్డిగూడెం: స్థానిక జేపీ సెంటర్‌లో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై దాడి చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. ఐదుగురిని అరెస్ట్ చేసి, రూ.4,100 స్వాధీనం చేసుకున్నామన్నారు.